




4

**అదితి గుప్త**

ఇప్పటికీ చాలాచోట్ల రుతుక్రమాన్ని ఓ పాపంగానో, శాపంగానో భావిస్తారు. దాని గురించి మాటలు ఉండవు. ఆ సమయంలో పరిశు భ్రంగా ఉండే పరిస్థితులు కనిపించవు. తను స్వయంగా అనుభవించిన ఆ వేదనతో అదితి Menstrupedia అనే కామిక్ పుస్తకాన్ని రూపొందించింది. కోటి మందికి పైగా పిల్లలకు అవగాహన కల్పించింది. 18 దేశాల్లో 16 భాషలలో ఈ పుస్తకం లక్ష లాది మంది ఆడపిల్లలకు తోడుగా మారింది.

**సౌందర్య రాజేష్**

పిల్లల కోసం కెరీర్ నుంచి ఓ రెండేళ్ల బ్రేక్ తీసుకున్న సౌందర్యకి... ఆ రెండో ఇన్నింగ్స్ ఎంత కష్టసాధ్యమో, ఎంత వివక్షతో కూడుకుం టాయో అర్థమైంది. దానిగురించి బాధపడుతూ కూర్చోకుండా myavtar పేరుతో తనలాంటి మహిళల కోసమే ప్రత్యేకంగా జాబ్ పోర్టల్ ఆరంభించారు. రెండు దశాబ్దాలుగా వేలా దిమందికి ఉపాధి కల్పించింది.

6



5

**అనిత బోర్గ్**

Science, Technology, Engineering, Maths (STEM) ఈ రంగా లలో మహిళల ప్రాధాన్యం ఇప్పటికీ చాలా తక్కువగా ఉంది. కొన్ని సబ్జెక్టులలో మగవారే బాగా రాణించగల రనే అభిప్రాయమే ఇందుకు కారణం. కొన్ని దశాబ్దాల క్రితమే ఈ అసమానతను సరిదిద్దాలి అనుకున్నారు అనిత. Institute for Women and Technology, Systers లాంటి ఎన్నో వ్యవస్థలు నిర్మించి STEM రంగంలో మహిళల పాత్రను పెంచారు.



**వీళ్లే కాదు... మన దేశంలోనే తొలి మహిళా వైద్యురాలు ఆనంది గోపాల్, మన దేశంలో కుటుంబ నియంత్రణను ఓ ప్రభుత్వ కార్యక్రమం స్థాయిలో విజయవంతం చేసిన అవాబాయ్ వాడియా లాంటి ఎంతోమంది అనూహ్యమైన వివక్షను దాటి అనుకున్నది సాధించడమే కాకుండా సాటి మహిళా లోకానికి కూడా అండగా నిలిచారు.**

**ఈ సమస్యలూ, సవాళ్లు ఒక్కరోజులో తీరేవి కావు. పరిశోధనలూ, ప్రయోగాలూ వెనువెంటనే ఆశలు రేపవు. ఒక్క తరం కాస్త జాగ్రత్తగా ఉండాలి. ఆడపిల్లలను పెంచడంలో, మహిళల గురించి మాట్లాడటంలో, ఆడవారి గురించి అభిప్రాయం ఏర్పరుచుకోవడంలో... కాస్త జాగ్రత్తగా ఉంటే చాలు! ఆ ప్రభావం ప్రతి వివక్షకూ జవాబుగా మారుతుంది.**

ఓ వందేండ్ల క్రితం మహిళలకు ఓటింగ్ హక్కులే ఉండేవి కావు. ఆ కాలానికి సంబం ధించిన ఏ దేశ చరిత్రను తీసుకున్నా... స్త్రీల ఓటు హక్కు కోసం పోరాడాల్సిన సందర్భాలు కనిపిస్తాయి. రోజులు మారాయి. మహిళ లకు ఓటు హక్కే కాదు... చట్టసభల్లోనూ రిజర్వేషన్లు కల్పించారు. కానీ, చట్టాలు చేయడంలో ఇప్పటికీ వారి పాత్ర పరిమితమే. సాక్షాత్తు ఐక్యరాజ్య సమితి లెక్కల ప్రకారం క్యాబినెట్ స్థాయిలో కేవలం 23 శాతం మాత్రమే మహిళలు ఉంటున్నారు. మహిళలు చేపట్టే క్యాబినెట్ ర్యాంకులలో ఎక్కువగా స్త్రీ, శిశు సంక్షేమం లాంటి బాధ్యతలే ఉంటున్నాయి. చట్టాల రూపకల్పనలో ఆడ వారు తక్కువ కావడం వల్ల ఏంటి నష్టం? అన్న ప్రశ్నకు ఓ ఆసక్తికర మైన జవాబు వినిపిస్తుంది. ఇప్పటికీ గాడి పొయ్యిల మీద వండటం, వ్యవసాయ క్షేత్రాలలో మహిళలే ఎక్కువగా పనిచేయడం... లాంటి ఎన్నో విషయాల్లో మహిళల పాత్రే కీలకం. అక్షరాస్యత తక్కువగా ఉంటే ఆడపిల్లలే ఎక్కువ వెనకబడతారు, కొవిడ్ లాంటి సమస్యలు వస్తే కుటుంబ బాగోగులు వారే చూసుకోవాలి, ఆఖరికి గ్లోబల్ వార్మింగ్ వల్ల కరువో వరదో వస్తే వారి మీదే ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ పరోక్ష ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ, ఇతర చట్టాల రూపకల్పనలో మహిళలకు మరింత భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉంది.



## చట్టసభల్లో చోటు లేకపోతే